# జనరల్ మోటార్స్ సమ్మె - గుణపాఠాలు

**అమెరికా** వ్యాప్తంగా జనరల్ మోటార్స్ యూనిట్లలో ఉన్న కార్మికులు 48 వేలమంది 2019 సెప్టెంబరు నుంచి నిరవధిక సమ్మెలో ఉన్నారు. యునైటెడ్ ఆటో వర్కర్స్ యూనియన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. వేతనాల పెంపు తదితర సౌకర్యాల కోసం సమ్మె చేస్తున్నారు. రెండు దశాబ్దాల తర్వాత జాతీయ సమ్మె చేయటం ఇదే మొదటిసారి. మాంద్యం కారణంగా వేతనాలు, ప్రయోజనాల్లో భారీ కోత విధించటంతో దశాబ్ద కాలంగా కార్మికుల్లో పేరుకుపోయిన అసంతృప్తి ఈ సమ్మెకు దారితీసింది. కంపెనీకి మంచి లాభాలు వస్తున్నప్పటికీ వేతనాల కోత ఉపసంహరించు కోలేదు. ఇది కార్మికులకు మరింత ఆగ్రహం తెప్పించింది.

ఆరు వారాలుగా జరుగుతున్న సమ్మె వల్ల జనరల్ మోటార్స్‌కు రోజుకు 9 కోట్ల డాలర్లు నష్టం వస్తోంది. అమెరికాలోని సమ్మెకు మద్దతుగా మెక్సికోలో కూడా సమ్మె చేస్తున్నారు. సమ్మె చేస్తున్న కార్మికులు ఒక్కొక్కరికి వారానికి 275 డాలర్లు యూనియన్ చెల్లిస్తోంది. వారెన్, మిచిగన్‌లలో జనరల్ మోటార్స్ ఉద్యోగులు ఆహారం, డైపర్స్, పిల్లల ఆహారాలను సేకరించి సరఫరా చేస్తున్నారు. ఈ సమ్మెకు ఇతర పరిశ్రమల నించి కూడా మద్దతు వస్తోంది.

యూనియన్ ఇటీవల యాజమాన్యంతో చర్చలు జరిపి తాత్కాలికంగా నాలుగేళ్ళ ఒప్పందాన్ని విడుదల చేసింది. దీనికి ఎక్కువమంది కార్మికులు సుముఖత తెలిపితే సమ్మె విరమించి పనులకు హాజరవుతారు. ఈ నాలుగేళ్ళ తాత్కాలిక ఒప్పందం వివరాలు పరిశీలిస్తే అర్ధమయేదేంటంటే ప్రపంచీకరణ శక్తులు యూనియన్ బేరమాడే శక్తికంటే బలమైనవని. తాత్కాలిక ఒప్పందం ప్రకారం వేతనాల్లో తక్షణం 3 శాతం పెరుగుదల, రెండేళ్ళకోసారి 4 శాతం వేతనం పెంపు ఉంటుంది. కానీ ఈ పెరుగుదల 2015 ఒప్పందంతో పోలిస్తే ఇదేమంత ప్రయోజనం కాదు. 2015 నుంచి సమ్మె లేకుండా ఉంటే వేతనం ఈ మేరకు సహజంగానే పెరిగేది. అయితే లాభాల వాటాలో 12 వేల డాలర్ల పరిమితిని ఎత్తివేసేందుకు యాజమాన్యం ఒప్పుకుంది. దీంతో బిలియన్ డాలర్ల కంపెనీ ఆదాయం నుండి ఒక్కో కార్మికుడికి వెయ్యి డాలర్లు వస్తుంది.

ఈ సమ్మె ప్రారంభానికి ముందే మూసివేసిన డెట్రాయిట్ ఫ్యాక్టరీలో పని ప్రారంభించేందుకు ఒప్పందం కుదిరింది. తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా మార్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కొత్తగా తీసుకున్న కార్మికులకు అనతికాలంలోనే పూర్తి జీతం వచ్చేలా విధివిధానాలు తయారవుతున్నాయి. గంటకు 30 నుంచి 35 డాలర్లు గరిష్ట వేతనానికి కూడా యాజమాన్యం ఒప్పుకుంది.

శాశ్వత కార్మికులకు 11 వేల డాలర్ల బోనస్, తాత్కాలిక కార్మికులకు 4 వేల 500 డాలర్లుగా నిర్ణయించారు. ఈ బోనస్ లెక్కింపులో సమ్మె కాలంలో పోయిన జీతాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటారు.

అయితే మెక్సికోలో తక్కువ వేతనాలకే కార్మికులు లభిస్తున్నందున నుంచి మూసివేసిన ఓహియో ఫ్యాక్టరీకి మెక్సికో కార్ల ఉత్పత్తిని మార్చేందుకు యాజమాన్యం ఒప్పుకోలేదు. మూసివేసిన లార్డ్స్ టౌన్ ప్లాంట్‌లో మాత్రం ఎలక్ట్రిక్ కార్ బ్యాటరీ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు ఒప్పుకుంది. ఈ ప్లాంట్‌లో అల్ప వేతనాలతో తక్కువమంది కార్మికులకు మాత్రమే ఉపాధి దొరుకుతుంది. ఆరు వారాలుగా సమ్మె జరుగు తున్నందున ఏ ప్రతిపాదన వచ్చినా ఒప్పుకునేలా కార్మికులపై వత్తిడి పెరిగిపోతోంది. తాత్కాలిక ఒప్పందం ఒరగబెట్టేది పెద్దగా లేకపోయినా కార్మికులను ప్రతిపాదనలకు ఒప్పుకోమని యూనియన్ కోరుతోంది. ఎక్కువశాతం మంది సుముఖంగా వున్నా స్ప్రింగ్‌హిల్ టెన్నిస్ అసెంబ్లీ ప్లాంట్ కార్మికులు మాత్రం ప్రతిపాదనలకు ఒప్పుకోవటంలేదు. ఏది ఏమైనా యూనియన్ 25-10-19న తన తుది నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. కొంతమంది వ్యతిరేకించినా తాత్కాలిక ఒప్పందానికి అంగీకారం కుదిరే అవకాశాలే కన్పిస్తున్నాయి.

ఈ సమ్మె నేపథ్యంలో జరిగిన పరిణామాలు పరిశీలిస్తే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ శక్తులు ఎంత బలమైనవో అర్ధమవుతోంది. పలురంగాల కార్మికులంతా ఏకమైతే తప్ప బహుళజాతి సంస్థల విధానాలపై పైచేయి సాధించలేమని తెలుస్తోంది. యూనియన్లు కొద్దిమంది నిర్ణయాలపై ఆధారపడకుండా ఉమ్మడి నిర్ణయాలు, అందరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుని ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలి. సమ్మె ఉపసంహరణ, ఒప్పందాలు తదితర అంశాలు పూర్తి అవగాహనతో కార్మికుల అంగీకారంతో జరగాలి.

ooo